ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 12 ఫిబ్రవరి 2024

రేచపల్లిలో కలకలం..
- పోలీసుల అదుపులో పౌర హక్కుల సంఘం నేత రాజేశం
- నాటకీయ పరిణామాల మధ్య ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు 7
- కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామస్థులు

వీధి వ్యాపారులకు భరోసా లభించేనా?


జగిత్యాలలో కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

- ఆసరాగా నిలుస్తున్న ఆత్మ నిర్భర్ పథకం
- జోరుగా తొలి, మలి విడత రుణాలు
- మూడో విడత రుణాల పంపిణీ షురూ
- వేల సంఖ్యలో లబ్ధిదారులు.. రూ. కోట్లలో రుణాలు
- జిల్లాలో 2,110 మంది గుర్తింపు

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్బర్ పథకంలో భాగంగా అందిస్తున్న మూడో విడత రుణాలతోనైనా బతుకులు బాగు పడుతాయని ఆశపడుతున్నారు. ఆర్థికంగా అస్తవ్యస్తమైన వీధి వ్యాపారులకు ఆసరాగా కేంద్ర ప్రభుత్వ పథకం ఉంటోంది. కొవిడ్ కారణంగా నాలుగేళ్ల క్రితం అన్నివర్గాల ప్రజల జీవనం, ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. ప్రధానంగా వీధి వ్యాపారం నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపింది. నెలల తరబడి దుకాణాలు మూతపడడంతో కుటుంబపోషణ భారంగా మారింది. కరోనా కారణంగా వ్యాపారాలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్బర్ పథకం అమలు చేస్తోంది. స్వల్పకాలిక రుణాలిచ్చి కొంత మేర ఆసరాగా సర్కారు నిలుస్తోంది. మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని అయిదు మునిసిపాలిటీల పరిధిలో వీధి వ్యాపారం చేసుకొని జీవించే చిరు వ్యాపారులను గుర్తించి రుణాలు అందిస్తోంది. మునిసిపాలిటీల్లో రహదారుల పక్కన వీధి వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులు, తోపుడు బండ్లు నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించింది. వీటితో పాటు రోడ్లపై మొబైల్ టిఫిన్ సెంటర్లు, ఇతర వ్యాపారాలుచేసే వ్యక్తులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు మెప్మా ఆధ్వర్యంలో సర్కారు పలు చర్యలు తీసుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా 16,632 మంది వీధి వ్యాపారు లుండగా జగిత్యాలలో 6,825, కోరుట్లలో 4,188, మెట్‌పల్లిలో 3,713, రాయికల్‌లో 924, ధర్మపురిలో 982 మంది వీధి వ్యాపారులను మెప్మా అధికారులు గుర్తించారు. వీరికి మెప్మా ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను సైతం అందజేశారు.

● మూడో విడత రుణాల పంపిణీ షురూ...

జిల్లాలో మొదటి, రెండో విడతలో రుణాలను తీసుకొని సక్రమంగా చెల్లించిన వీధి వ్యాపారులకు మూడో విడత రుణాలను అందిస్తున్నారు. జిల్లాలో రెండో విడత రుణాలను సంపూర్ణంగా చెల్లించిన వీధి వ్యాపారులను అధికారులు గుర్తించారు. రెండో విడత రుణాలను తీసుకున్న అనంతరం రెండు సంవత్సరాల్లోపు సంబంధిత బకాయిలను చెల్లించాల్సి ఉంటుంది. మూడో విడత కార్యక్రమంలో ఒక్కో వీధి వ్యాపారికి రూ. 50 వేల రుణ సహాయాన్ని అందించడానికి కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1,036 మంది వీధి వ్యాపారులకు సుమారు రూ. 10.36 కోట్ల మూడో విడత రుణాలను అందించారు. ఇందులో ధర్మపురిలో 102, జగిత్యాలలో 473 మంది, కోరుట్లలో 145 మంది, మెట్‌పల్లిలో 204 మంది, రాయికల్‌లో 112 మందికి మూడో విడత రుణాలను అందించారు.

మొదటి విడతలో రూ. 10 వేల రుణం..

జిల్లాలో మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించకుండా అర్హులైన వ్యాపారులు తీసుకున్న రుణం మొత్తం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాల్టీల్లో ఆత్మనిర్బర్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఐదు మున్సిపాల్టీల్లో మొత్తం 12,161 మంది వ్యాపారులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ. 12.16 కోట్ల రుణం పంపిణీ చేశారు. ఇందులో ధర్మపురిలో 711 మందికి, రాయికల్‌లో 793 మందికి, మెట్‌పల్లిలో 2,744 మందికి, కోరుట్లలో 3,248 మందికి, జగిత్యాలలో 4,665 మందికి రుణాలు అందించారు.

● డిజిటల్ లావాదేవీలు జరిపితే రూ. వంద క్యాష్ బ్యాక్....

వీధి వ్యాపారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్వనిధి యోజనను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. డిజిటల్ లావాదేవీలు చేసే చిరు వ్యాపారులకు నెలకు రూ. 100 వరకు క్యాష్ బ్యాక్ కూడా లభిస్తుంది. చిరు వ్యాపారులు పీఎం స్వనిధి వెబ్‌సైట్, పీఎం స్వనిధి మొబైల్ యాప్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు రూ. 10 వేల వరకు రుణాలను మోదీ ప్రభుత్వం అందించింది. ఒక యేడాది పాటు రుణం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈఎంఐల ద్వారా సైతం లోన్ చెల్లించే అవకాశం కల్పించింది. రుణాలు సకాలంలో చెల్లిస్తే ఏడు శాతం వార్షిక వడ్డీ సబ్సిడీ బ్యాంకు అకౌంట్‌లో క్రెడిట్ అవుతోంది. ముందుగా రుణాలు చెల్లించిన వారికి ఎలాంటి పెనాల్టీ ఉండదు.

● సకాలంలో చెల్లిస్తే రెండో విడతలో రెట్టింపు రుణం...

జిల్లాలో 2020 సంవత్సరం మార్చి నుంచి ప్రతీ వీధి వ్యాపారికి రూ. 10 వేలు అందించేలా ఆత్మనిర్బర్ పథకాన్ని అమలు చేస్తున్నారు. తీసుకున్న రుణాన్ని ఏడాదిలోపు ఏడు శాతం వడ్డీతో బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. సక్రమంగా నిర్ణీత గడువులోగా చెల్లించి వ్యాపారులకు రెండో విడతలో రెట్టింపు రుణం రూ. 20 వేలు అందించారు. జిల్లాలో ఇప్పటివరకు 5,683 మందికి రూ. 16.83 కోట్లు రెండో విడత రుణాలను అధికారులు అందించారు. ఇందులో రాయికల్‌లో 383 మందికి, ధర్మపురిలో 421 మందికి, కోరుట్లలో 1,624 మందికి, మెట్‌పల్లిలో 1,027 మందికి, జగిత్యాలలో 2,228 మందికి రెండో విడత రుణాలను అందించారు.

అర్హులందరికీ రుణాలు అందిస్తాం...

- శ్రీనివాస్, మెప్మా ఏవో, జగిత్యాల జిల్లా



జిల్లాలో అర్హులైన వీధి వ్యాపారులందరికీ ఆత్మనిర్బర్ పథకం కింద రుణాలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే జిల్లాలో తొలి, మలి విడతల్లో దాదాపుగా లక్ష్యాన్ని సాధించాము. తీసుకున్న రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించిన వ్యాపారులకు మూడో విడత రుణాన్ని అందిస్తున్నాము. ప్రభుత్వ పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి.

చిన్నారికి అండగా ఉంటాం: అధైర్యపడకండి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొడిమ్యాల, ఫిబ్రవరి 11: గుండెకు ఏర్పడిన రంధ్రంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న మండల కేంద్రానికి చెందిన చిలువేరి నరేష్‌శరణ్య దంపతుల నాలుగు నెలల చిన్నారి దన్విక‌కు అండగా ఉంటానని చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చిన్నారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే కలిసి అధైర్యపడవద్దని తన వంతుగా లక్ష రూపాయలను అందిస్తానని హామీ ఇచ్చారు. గుండె చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి వచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానన్నారు. మీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానన్నారు. నియోజకవర్గంలో ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సహాయాన్ని అందిస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరీరాజేందర్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యం శంకర్, ప్రభాకర్‌రెడ్డి, హన్మండ్లు, ప్రసాద్, శంకర్, జితేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, వినోద్‌రెడ్డి, కొండూరి రాజేష్, దిలీప్, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్డు వేశారు.. స్తంభాలు తీయడం మరిచారు


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

పెగడపల్లి, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో నంది చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ సమీపంలోని పెట్రోల్‌బంక్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం మధ్యలో విద్యుత్ స్తంభాలు తీయకుండానే వదిలేశారు. రోడ్డు వెడల్పు సెంట్రల్ లైటింగ్ పనులకు గాను రూ. రెండు కోట్లు మంజూరు కాగా నిర్మాణ పనులు దాదాపు రెండేళ్లుగా నత్తనడకన నిర్మించడంతో పాటు నిర్మాణ పనులు సైతం అస్తవ్యస్తంగానే సాగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ నుంచి పెట్రోల్ బంక్ వరకు రోడ్డు వెడల్పు నిర్మాణ పని చేపట్టగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు తీయకుండానే వదిలేసి కంకర రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కంకర రోడ్డు నిర్మాణ పనులు చేసి దాదాపు నెలరోజులు గడుస్తున్నప్పటికీ విద్యుత్ స్తంభాలు తీయకుండా వదిలేయడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని భయంభయంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాలు తీయించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం


రంగు గోపాల్, ఆడెపు నర్సయ్య

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11: భారతీయ జనతా పార్టీ పట్టణ, ఆయా మండల బాధ్యుల నూతన నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల పట్టణ అధ్యక్షుడిగా రంగు గోపాల్, బీర్‌పూర్ మండల అధ్యక్షుడిగా ఆడెపు నర్సయ్యను నియమించామన్నారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యులు మాట్లాడుతూ పార్టీ బలోపే తంతో పాటు, రానున్న ఎన్నికల్లో ఎంపీగా అర్వింద్ గెలుపుకోసం కృషి చేస్తామ న్నారు. తమపై నమ్మకంతో నియమించిన జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సవ కమిటీ నియామకం

వెల్గటూర్, ఫిబ్రవరి 11: స్తంభంపల్లి వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవ కమిటీని నియమిస్తూ ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పాకల్ల నరేష్, కమిటీ సభ్యులుగా చింతల శివకుమార్, పాదం తిరుపతి, అన్నెవేని వెంకటేష్, రాపాక నర్సమ్మ, యాగండ్ల రాజయ్య, లవంగం తిరుపతి, చింతల రమేష్ నియమితులయ్యారు. కాగా ఆదివారం కమిటీ సభ్యులకు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కాశ శ్రీధర్, యాగండ్ల గంగయ్య, సప్ప తిరుపతి, మార్గం సతీష్, పొడేటి మల్లయ్య, అయ్యోరి సత్తయ్య, రమేష్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటు

ధర్మపురి, ఫిబ్రవరి 11: ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్య తీరింది. పాఠశాలలో కొన్నినెలల నుంచి విద్యార్థులు నీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం, పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుక వెళ్లారు.

వెంటనే ఆయన స్పందించి యుద్ధ ప్రాతిపదికగా పాఠశాల ఆవరణలో బోర్‌వెల్ వేయించా రు. దీంతో పాఠశాలలో తాగు నీటి సమస్య పరిష్కారం అయ్యింది. ఇందు కోసం సహకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, జక్కు రవీందర్ తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్గటూర్, ఫిబ్రవరి 11: మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త హరీష్ తండ్రి గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతి, వెంకటస్వామి, తిరుపతి, మొగిలి పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


టీఆర్‌టీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 11: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని 50 మంది లబ్ధిదారులకు 50,05,800 రూపాయల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పేదింటి ఆడపడుచులకు ఒక వరమని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి దరఖాస్తులను ప్రభుత్వ కార్యాలయాల్లో నేరుగా సమర్పించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, డిప్యూటీ తహసీల్దార్ సుమన్, మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం కన్వీనర్ రెడ్డవేని సత్యం, టీపీసీసీ సభ్యుడు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గాయత్రీ నిత్యాన్న సత్ర భవనం ప్రారంభం..

ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన 17 లక్షల రూపాయలతో నిర్మించిన గాయత్రీ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్ర సంఘం పైఅంతస్తు నూతన భవనాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం దూర ప్రాంతాల నుంచి ఈ క్షేత్రానికి వచ్చే పేద బ్రాహ్మణులకు ఈ సత్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సత్ర సంఘం అభివృద్ధి కోసం తన వంతుగా పూర్తి సహాయ సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మపురి పట్టణ గాయత్రీ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్ర సంఘం అధ్యక్షుడు మధ్వాచారి రాంకిషన్, ప్రధాన కార్యదర్శి కొరిడె దత్తాత్రి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఇందారపు రామయ్య, నిత్యాన్నదాన సత్ర సంఘం కమిటీ సభ్యులు కొరిడె శంకర్, బొజ్జ దత్తాత్రి, బల్యపెల్లి లింగన్న, బొజ్జ శంకర్, కిష్టయ్య, పాలెపు చంద్రమౌళి, సుముఖ్, నరేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● టీఆర్‌టీఎఫ్ డైరీ ఆవిష్కరణ

ధర్మపురి మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) నూతన డైరీని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజభీంకార్ గోవర్ధన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు దాసరి భీమయ్య, మండల శాఖ అధ్యక్షులు బండారి సతీష్, కాసర్ల వెంకటరమణ, మూర్తి, మెరుగు రమేష్, భూమారెడ్డి, ఒజ్జల మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

● ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మపురి పట్టణంలోని తన నివాసంలో ధర్మపురి మండల మున్నూరుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, ప్రధాన కార్యదర్శి బండారి లక్ష్మణ్, ము న్నూరుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు బక్కశెట్టి మల్లేశం, అధ్యక్షుడు శీలం రాజేష్, ప్రధాన కార్యదర్శి అయ్యోరు వినోద్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, నాయకులు జనార్ధన్, మహేష్, సత్తయ్య, రమేష్, రాజేందర్, గంగన్న, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కన్యాకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవానికి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజా కార్యక్రమాలను జరిపారు. అమ్మవారికి కలశ స్థాపన, అభిషేకం, సామూహిక కుంకుమార్చన తదితర పూజలను చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణ, సంఘం గౌరవాధ్యక్షుడు ఎడవల్లి సురేశ్ కుమార్, పలు కాలనీలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, అర్చన, వాసవీ హవనం, సామూహిక వాసవి చరిత్ర పారాయణం, సామూహిక కుంకుమార్చన, కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మంచాల జగన్, కోత్త సురేష్, సుదీర్, అల్లాడి ప్రవీణ్, గాదే సాయి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితులు భాస్కర్‌శర్మ, బాలకృష్ణ స్థాపిత దేవత పూజ, నవగ్రహ పూజ, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, అలంకరణ, పూజలు, హారతి వంటి కార్యక్రమానలు వైభవంగా జరిపించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు దంపతులు, అర్యవైశ్యులు హోమం వంటి కార్యక్రమాలను చేశారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు, కార్యదర్శి ఎల్మి రవి, బండారి సదాశివకుమార్, ఆలయం అధ్యక్షుడు చాడ సురేష్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య ఆధ్వర్యంలో ఘనంగా మహాచండీ హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయంలో పురోహితులు శ్యామ్‌సుందర్‌శర్మ బృందం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ, అర్చనలు, హారతీ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా చండీ హోమం కార్యక్రమాలను జరిపించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు చౌడరపు శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా జోనల్ చైర్మన్ శివ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంఘం శ్రీనివాస్, కోశాధికారి మేడి శివ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


గొల్లపల్లి, ఫిబ్రవరి 11: గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో రూ.10 లక్షలు, రాఘవపట్నంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ లంబధనవ్వ లక్ష్మణ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేయించాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయించిన లక్ష్మణ్ కుమార్‌కు, ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు పురపాటి రాజిరెడ్డి, గ్రామ కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ నియామకం

గొల్లపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని భీంరాజ్‌పల్లెలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. దీనికి ఎమ్మార్పీఎస్ గొల్లపల్లి మండల అధ్యక్షుడు చెవులమద్ది రమేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ముల్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. గ్రామ శాఖ అధ్యక్షునిగా కొలగాని తిరుపతి, ఉపాధ్యక్షులుగా కొలగాని సతీష్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొలగాని శ్రీకాంత్, కార్యదర్శిగా కొలగాని వేణు, ప్రచార కార్యదర్శిగా కొలగాని రాజేందర్, సంయుక్త కార్యదర్శిగా కొలగాని బాబు, సంయుక్త కార్యదర్శిగా కొలగాని సురేష్, కార్యవర్గ సభ్యులుగా కొలగాని శేఖర్, కొలగాని తిరుమలేష్, ఆనంద్ రాజ్ కుమార్, నరేష్‌ను ఎన్నుకున్నారు.







గంగపుత్రుల హక్కులు కాపాడుతాం

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంగ పుత్రుల హక్కులు కాపాడడానికి అనవరమైన కృషి చేస్తానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన గంగపుత్రుల మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కుల సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. చెరువులు, కుంటలపై కేవలం గంగపుత్రులకు మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో గీచే వాడిదే చెట్టు అని హక్కు కల్పించామని, చేపలు పట్టే వారికే చెరువులు, కుంటలపై గంగపుత్రులు, మత్స్య కార్మికులకు హక్కులు ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ సెల్ అధ్యక్షుడు మిట్ల సాయికుమార్, పలువురు గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంబజార్ కాలనీకి చెందిన మంతెన అక్షయ్ (27) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలన జరిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సంఘటనపై ఎస్ఐ మన్మథరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేశ్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మానకొండూర్, ఫిబ్రవరి 11: మండలంలోని శంషాబాద్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గుర్తు తెలయని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని గ్రామపంచాయితీ సిబ్బంది ఎండీ హకీం ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 11: రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బోగ లచ్చయ్య(50) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రయాణికుల కోసం ఆటోను గ్రామంలోని ఒక స్టేజీ వద్ద పెట్టి ఇంటికి బయలుదేరాడు. వెల్గటూర్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు (ఏపీ 40 ఏఎన్7609) నడుచుకుంటూ వెళ్తున్న లచ్చయ్యను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తరుపున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ శ్వేత తెలిపారు.

డెంగ్యూతో బాలిక..



చతుర్వేద (ఫైల్)


పెగడపల్లి, ఫిబ్రవరి 11: పెగడపల్లి మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల చతుర్వేద (7) అనే బాలిక ఆదివారం డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల పవన్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ ఏడాది కాలంగా భార్యా పిల్లలతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారం రోజులుగా చతుర్వేద డెంగ్యూ జ్వరం బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు




నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

మానకొండూర్, ఫిబ్రవరి 11: అంతర్ జిల్లా దొంగల ముఠాను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పోలీసుల అదుపులో అంతర్ జిల్లా దొంగల ముఠా అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని సదాశివపల్లి వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టాను. ఆ సమయంలో ఓ కారు (టీఎస్ 21డి 7715)లో ఇద్దరు దాని వెనకాల స్కూటీపై ఒక్కరు వస్తుండగా వాహనాలను పోలీసులు నిలిపివేశారు. వాహనాలను తనిఖీ చేయగా అందులో ఇన్వర్టర్, ఉడెన్ టేబుల్, రాగి వైరు కట్టతో పాటు స్కూటీపై టేబుల్ ఫ్యాను ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో మానకొండూర్‌కు చెందిన కొండ్ర ఫణీందర్, కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన నెరువట్ల వెంకటేశ్, నెరువట్ల అజయ్, పర్వతం సతీష్ ఒక ముఠాగా ఏర్పడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్, సైదాపూర్, జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్‌రూరల్, ఎల్ఎండీతో పాటు పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలోని జూలపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాలలో విద్యుత్ మోటార్లు, వాటి పరికరాలను దొంగిలించిగా 27 కేసులు నమోదు అయినట్లు తేలింది. దొంగిలించిన వస్తువులను మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సిరిగిరి వెంకటమ్మ, కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీకి చెందిన టేకు మల్లేశం, కోతిరాంపూర్‌కు చెందిన లోకిని లక్ష్మికి విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యక్తులతో పాటు ముఠా సభ్యుడు అజయ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద ఉన్న కారు, స్కూటీ, రాగివైర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకునేందుకు కృషి చేసిన మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు.









భక్తురాలి బంగారం చోరీ

వేములవాడ, ఫిబ్రవరి 11: రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన వరంగల్ జిల్లాకు చెందిన రామక్క అనే 70 సంవత్సరాల వృద్ధురాలిని నమ్మించి బంగారం కాజేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రాజన్నను దర్శించుకున్న అనంతరం జాతర గ్రౌండ్ వైపు నడచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని గమనించిన నిందితుడు మీ గది పక్కనే తాము కూడా ఉన్నామని నమ్మించి ద్విచక్ర వాహనంపై ఎక్కించు కున్నాడు. జగిత్యాల బస్‌స్టాండ్ వైపు తీసుకెళ్లి దాదాపు మూడున్నర తులాల బంగారు గొలుసును లాకున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. నిందితుడు మెరున్‌కలర్ చెక్స్ ఉన్న షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. రాజన్న సన్నిధికి వచ్చిన భక్తులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

చందుర్తి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీపై కుట్రలు చేస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా ఆదివారం రెండో రోజు చందుర్తి మండలం లింగంపేటలో ప్రారంభమైంది. కట్టలింగంపేట, మల్యాల, చందుర్తి, రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా కట్టలింగంపేటలో రేషన్ దుకాణంలో బండి సంజయ్ పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు రాగానే రెండు పార్టీలు ఒక్కటవుతాయని, పైకి మాత్రం తిట్టుకుంటారని అన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ ఇప్పటి వరకు అభ్యర్థిని పెట్టలేదని, కేవలం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉండడానికి చూస్తోందని అన్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ ప్రచారం చేసిందన్నారు. బీజేపీని బదనాం చేయడానికే కుట్ర చేశారన్నారు. బీజేపీ అత్యధిక స్థానాలు గెలవనున్నట్లు సర్వేలు వచ్చాక వాళ్లకి మనసున పడడం లేదన్నారు. తమది బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకునే మూర్ఖత్వం పార్టీ కాదన్నారు. ఒంటరిగా పోటీ చేస్తున్నామని చెప్పుకునే దమ్ము బీఆర్ఎస్‌కు లేదన్నారు. తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమనే ప్రజలు గమనించాలన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయన్నారు. ఫామ్ హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ మళ్లీ కుట్రలు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ఒక్క ఎంపీ సీటు రాదని, తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టారని అన్నారు. బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ చూశాక ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. ఈ నెల చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, ఎన్నికల షెడ్యూల్ అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ లేని దేశాన్ని ఊహించుకోలేమన్నారు. మేడిగడ్డ కుంగడంపై లక్ష కోట్లు ఖర్చు చేసి ప్రజల ధనం వృథా అయితే బీఆర్ఎస్ చిన్న సమస్య అంటోందన్నారు. కాంగ్రెస్ ఎందుకు విచారణకు ఆదేశించడం లేదన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా ఊహించుకోవడం కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు పోంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, కటకం లోకేష్, పెరిక గంగరాజు, ఎర్రం మహేష్, రేగుల మల్లికార్జున్, చింతకుంట గంగాధర్, లోకోజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్

మోదీ ప్రభంజనంలో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు



దుంపెటలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్

కథలాపూర్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభంజనం మూడో సారి వీస్తుందని అందులో ప్రతిపక్షాలు కొట్టుకుపోవడం తథ్యమని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా రెండోరోజు మండలంలోని సిరికొండ నుంచి ఆరంభం కాగా విలేకరులతో కాసేపు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పరిస్థితి ఎప్పటికీ తలెత్తదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని మునిగిపోయిన నావతో సంబంధాలు ఎలా పెట్టుకుంటామని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ అధ్వానంగా ఉందని ఆరు గ్యారంటీలకు కావల్సిన వ్యయం, కేటాయించిన నిధులకు భారీ తేడా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పరిపాలన చేతకాదని ఈ బడ్జెట్ రూపకల్పనతో తేలిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని ప్రజలు విసుగెత్తిపోయారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాయకులు, యువత పకడ్బందీగా పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక అభివృద్ధిలో పురోగమనంకు బాటలు వేసినట్లు చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలైనా బీజేపీ విజయం సాధిస్తుందని చెబుతున్నాయన్నారు. అనంతరం సిరికొండ, దూలూరు, దుంపెట, తాండ్ర్యాల, అంబారిపేట, కలికోట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాహిత యాత్రలో చిన్నారులను ఎత్తుకున్నారు. మహిళలు, వృద్ధులకు అభివాదం తెలిపారు. పలు గ్రామాల్లో శివాజీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. గ్రామాల్లో ఎంపీకి డీజే చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. వాడల్లో తిరుగుతూ నమస్కరించారు. గడిచిన ఐదేళ్లలో పార్లమెంట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రావమడుగు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రవీణ్, జలంధర్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- అత్తింటివారిపై భర్త దాడి.. ఆత్మహత్యాయత్నం



గొంతుకోసుకున్న కళాధర్

బోయినపల్లి, ఫిబ్రవరి 11: భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. భర్త తీరు మారకపోవడంతో భార్య విడాకులు కోరింది. నిరాకరించిన భర్త ఆమె ఇంటికి చేరుకొని చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. బోయినపల్లి మండలం రామన్న పేటగ్రామంలో ఆదివారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట గ్రామానికి చెందిన శ్వేతకు ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు చెందిన సామ కళాధర్‌రెడ్డికి 2021లో వివాహమైంది. ఆరు నెలల అనంతరం కళాధర్ మద్యానికి బానిసయ్యాడు. భార్యశ్వేతను వేధించ సాగాడు. భర్త తీరు మారకపోవడంతో శ్వేత పెద్ద మనుషుల సమక్షంలో నిర్వహించిన పంచాయితీలో విడాకులు కోరింది. ఆదివారం తెల్లవారుజామున కళాధర్ శ్వేత ఇంటికి వచ్చి చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. తలుపులు తీయకపోవడంతో కళాధర్ వెంట తెచ్చుకున్న బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకోని 108 ద్వారా సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కళాధర్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. శ్వేత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూగజీవాలపైకి దూసుకెళ్లిన లారీ

- 40 గొర్రెలు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: మండలంలోని చిగురుమామిడి గ్రామపంచాయితీ పరిధిలోని రాజన్నపల్లి వద్ద ఆదివారం గ్రానైట్ లారీ ఢీకొన్న ప్రమాదంలో 40 గొర్రెలు మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. చిగురుమామిడికి చెందిన సొదం కనుకయ్య, ముదుకిరి సమ్మయ్య గ్రామ శివారులో గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం వేళ ఇంటికి తరలిస్తుండగా కరీంనగర్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యూఏ 6438) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేచపల్లిలో కలకలం..

- పోలీసుల అదుపులో పౌర హక్కుల సంఘం నేత రాజేశం
- నాటకీయ పరిణామాల మధ్య ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు
- కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు గ్రామస్థుల సమాచారం

అది జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లికి వెళ్లే రోడ్డు.. ఆదివారం తెల్లవారు జామున ఆ రోడ్డుపై రెండు నంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపించాయి. ఆ వాహనాల్లో నుంచి దిగిన ఎనిమిది మంది వ్యక్తులు హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు.. అటువైపు వెళ్లిన బట్టపల్లి గ్రామానికి రైతులు వారిని గమనించి చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చిన ముఠాగా భావించారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. వారు వాహనాల్లో వచ్చిన వారిని నిలదీయడంతో తాము ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులమని తెలిపారు. దీంతో గ్రామస్థులు సారంగపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వచ్చి వారితో మాట్లాడి ఛతీస్‌గఢ్ పోలీసులు అని నిర్ధారించుకుని వెళ్లిపోయారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులు రేచపల్లికి వెళ్లి పౌరహక్కుల సంఘం నేత పోగుల రాజేశంను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

- ఆంధ్రజ్యోతి, జగిత్యాల/ సారంగాపూర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కోశాధికారి రాజేశంను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. దంతేవాడ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో గల ఓ కేసులో విచారణ కోసం తీసుకవెళ్తామని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఇదేమిటని కుటుంబసభ్యులు ప్రశ్నించినప్పటికీ బలవంతంగా రాజేశంను, అతని భార్య మల్లీశ్వరిని వాహనంలో తీసుకెళ్లారు. రేచపల్లి శివారులోకి వెళ్లిన అనంతరం రాజేశం భార్య మల్లీశ్వరిని వాహనం నుంచి దింపివేసి వెళ్లిపోయారు. రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని ఆయన మల్లీశ్వరి, కుటుంబ సభ్యులు అంటున్నారు. ఈ విషయమై సారంగపూర్ ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ రేచపల్లి గ్రామానికి వచ్చి రాజేశంను తీసుకవెళ్లింది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిగా ధ్రువీకరించుకున్నామని తెలిపారు. తీవ్రవాదానికి సంబంధించిన ఓ కేసులో నిందితుడిగా ఉన్న రాజేశంను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారన్నారు.



పోగుల రాజేశం





ఛత్తీస్‌గఢ్ పోలీసులు రేచపల్లికి వచ్చిన నంబరు లేని వాహనం, రాజేశంను ఇంటికి పంపాలని వేడుకుంటున్న భార్య, కుమారుడు

● రాజేశంను వెంటనే విడిచిపెట్టాలి

- రాజేశం భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్

పౌరహక్కుల సంఘం నేత రాజేశంను వెంటనే విడిచిపెట్టాలని ఆయన భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్‌లు కోరుతున్నారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. రేచపల్లి గ్రామానికి గుర్తు తెలియని వాహనాల్లో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా రాజేశంను తీసుకవెళ్లారన్నారు. విషయాన్ని పోలీసులకు అందించగా ఛత్తీస్‌గఢ్‌కు ఓ కేసు విచారణలో రాజేశంను అక్కడి పోలీసులు తీసుకవెళ్లారని అంటున్నారని, తమకు సమాచారం లేదన్నారు. రాజేశంను వెంటనే విడిచి పెట్టాలని కోరారు.

● రాజేశం కిడ్నాప్‌ను ఖండిస్తున్నాం

- కుమార స్వామి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పోగుల రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. ఆయన జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండా పలువురు వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ పోలీసులుగా చెప్పుకుంటూ రాజేశంను తీసుకవెళ్లడం సమంజసం కాదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఫోన్ ద్వారా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను సంప్రదించగా పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రాజేశంను అక్రమ నిర్బంధం నుంచి వెంటనే విడిపించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రశ్నించే గొంతుకలుగా ఉన్న పౌర హక్కుల సంఘం కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, ఉపాధ్యక్షుడు నార వినోద్, సహాయ కార్యదర్శి గడ్డం సంజీవ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కడ రాజన్న, మోటపలుకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో మహిళ ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందని గోల్కొండ రాజేశ్వరి(37) తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని సంవత్సరాల నుంచి ఆమె మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఆమె జీవితంపై విరక్తి చెంది తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. మృతురాలి భర్త రాజేశం జీవనోపాధి కోసం దుబాయ్‌లో ఉన్నాడు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి నర్ర వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై 2 ఎస్ అశ్విని తెలిపారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11: వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన శ్రీనివాస్ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లాడు. భార్య బంధువుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తాళం పగలగొట్టి ఇంట్లోని రూ. లక్ష నగదుతోపాటు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనసంద్రంగా మారిన వేములవాడ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

సర్వమత సమానత్వం పాటించాలి

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సర్వమత సమానత్వం పాటించాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మంచినీళ్ల బావి దగ్గర జరుగుతున్న ఈద్గా ఫ్లోరింగ్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని మతాలను గౌరవించాలని సూచించారు. పట్టణంలోని ఎడ్ల అంగడి వద్ద గల రామాలయం, క్యాంపులోగల కోదండ రామాలయం స్థలాలు కబ్జాకు గురికాకుండా గతంలో తాను కాపాడామని వివరించారు. అంతర్గామ గ్రామంలో గల హనుమాన్ దేవాలయ అభివృద్ధికి, వడ్డెర కాలనీలో గల రామాలయం అభివృద్ధికి నిధులు కేటాయించామ న్నారు. ఈద్గా ఫ్లోరింగ్ మరమ్మతు పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఫిషర్ సెల్ అధ్యక్షుడు సాయికుమార్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, నాయకులు మన్సూర్ ఖాన్, నేహల్, మోయిజ్, కమల్ పాల్గొన్నారు.

● పట్టణంలోని 29వ వార్డు తెనుగు వాడలో గల దగ్గులమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన పలు పూజలు, అర్చనల్లో భాగస్వామ్యమయ్యారు. ముదిరాజ్ సంఘ భవన అభివృద్ధికి నిధులు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, జున్ను రాజేందర్, రమేశ్, రావు, పెద్దులు, నాంచారి రాజు, బొల్లి శేఖర్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లధర్మారంలో ఆన్‌లైన్ మోసం

- మహిళ అకౌంట్లో నుంచి 18,000 మాయం

బీర్‌పూర్, ఫిబ్రవరి 11: మండలంలోని తాళ్లధర్మారం గ్రామంలో ఆదివారం ఓ మహిళను ఓటీపీ అడిగి 18,000 రూపాయలు డ్రా చేసిన ఘటన శనివారం జరిగింది. గ్రామానికి చెందిన తోట రేణుక వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మీకు స్కానర్ వచ్చిందని తీసుకోవాలని అడిగారు. తనకు స్కానర్‌తో పనిలేదని షాపు ఎలాంటివి లేవని నిరాకరించారు. దీంతో స్కానర్‌ను తిరిగి పంపించాలంటే సెల్‌కు ఓటీపీ వస్తుంది ఓటీపీ చెప్పాలని అపరిచ వ్యక్తి అడగడంతో ఓటీపీ చెప్పింది. దీంతో రేణుకకు చెందిన ఒక అకౌంట్లో నుంచి 8000 రూపాయలు, మరో అకౌంట్లో నుంచి 10,000 రూపాయలు డ్రా అయినట్లు రేణుక భర్త స్వామి జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు.

డాక్టరేట్ అందుకున్న సామాజిక సేవకుడు మున్ను

రాయికల్, ఫిబ్రవరి 11: రాయికల్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు ముస్తాక్ అహ్మద్ మున్ను డాక్టరేట్‌ను అందుకున్నాడు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన అల్లూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ వారు తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేసేవారికి అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా మహ్మద్ ముస్తాక్ అహ్మద్ మున్ను చేస్తున్న సామాజిక సేవలు, రక్తదానం, రక్తదానంపై అవగాహన సదస్సులు, అన్నదానాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు సహాయం చేస్తున్నాడు. డాక్టరేట్ అందుకున్న పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా మున్ను మాజీ పార్లమెంట్ సభ్యుడు సముద్యాల వేణుగోపాలచారి, ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఆలూరి విల్సన్, సినీ నటుడు మణిచందన్, నేపథ్య గాయకుడు త్రినాథేశ్వర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు.

ఖమ్మం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా టీపీటీఎఫ్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాధ్యులు ఖమ్మంలో నిర్వహిస్తున్న విద్యా, వైజ్ఞానిక మహాసభకు ఆదివారం తరలివెళ్లారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సభలో ఉపాధ్యాయ, విద్యారంగ సవాళ్లు, పరిష్కారం, సమానత్వ, విద్యా సాధ్యాసాధ్యాలపై మేధావులతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ మహాసభల్లో విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక అంశాలపై సెమినార్ ఉంటుందని సంఘ బాధ్యులు బోగ రమేష్ తెలిపారు. ఆయన వెంట జిల్లా టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే సహాయం

భీమారం, ఫిబ్రవరి 11: భీమారం మండల కేంద్రానికి చెందిన యువకుడు దయ్యు సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిత్యావసర సరుకులు పంపించారు. సురేష్ మృతితో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వపరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చి వారి కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపించారు. వీటిని కాంగ్రెస్ నాయకులు శంకర్‌గౌడ్, సంజీవ్, సత్యనారాయణ, ద్యావనపెల్లి అనిల్, కొత్తూరి లక్ష్మణ్, కొత్తపల్లి రమేష్, పల్లి వంశీ బాధిత కుటుంబానికి అందజేశారు.

అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా 'అంబటి'

కోరుట్ల ఫిబ్రవరి 11: పట్టణంలోని జ్ఞాన సరస్వతి, శనైశ్వర సహిత అయ్యప్పస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాస్ ఆదివారం ఎన్నికయ్యారు. దేవాలయ అభివృద్ధి కమిటి అధ్యక్ష పదవికి అంబటి శ్రీనివాస్, దగ్గుల నర్సయ్య పోటీ చేశారు. శాశ్వత సభ్యులు 1,289 మంది ఉండగా 826 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో అంబటి శ్రీనివాస్‌కు 606 ఓటు రాగా దగ్గుల నర్సయ్యకు 220 ఓట్లు వచ్చాయి. అంబటి శ్రీనివాస్ 386 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు పోతని ప్రవీణ్, ఆకుల రాజేష్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అంబటి శ్రీనివాస్‌కు దేవాలయ శాశ్వత అధ్యక్షుడు చిద్రాల నారాయణ నియామక పత్రాన్ని అందించారు.

కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 11: గ్రామాల స్వచ్ఛతకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అధికారులు కొనసాగిస్తున్నారు. ఆదివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి నిజామొద్దిన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంచి నీటి ట్యాంక్‌ల శుభ్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలు, బస్టాండ్ పరిసరాల్లో శుభ్రత చర్యల్లో భాగంగా శ్రమదానం చేపట్టి రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఇంట్లోని చెత్తను మురికి కాలువలుల్లో, రోడ్లపై వెయ్యకుండా ఇంటి ముందుకు వచ్చే పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. గ్రామస్థులు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరయని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘ భవనం పనులకు భూమిపూజ

కథలాపూర్, ఫిబ్రవరి 11 : మండలంలోని చింతకుంటలో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టనున్న కుమ్మరి సంఘం భవన నిర్మాణ పనులకు ఆదివారం జడ్పీటీసీ నాగం భూమయ్య భూమిపూజ చేశారు. అదేవిధంగా బోరు, మోటర్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధారపు రమేశ్, వంగ రవీందర్, లోక రాజరెడ్డి, పంచిత్ శంకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీగా ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి

కథలాపూర్, ఫిబ్రవరి 11: గడిచిన ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన అభివృద్ధి శూన్యమని ఎన్ని నిధులు తెచ్చావో ప్రజలకు చెప్పాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకే ప్రజాహిత యాత్ర నిర్వహిస్తున్నారని ఎద్దేవ చేశారు. దేశం కోసం, ధర్మం కోసమని యువతను మతం పేరిట రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఉపాధిహామీ నిధులు యథావిధిగా రాష్ట్రాలకు విడుదలవుతాయని ఆ నిధులను తానే తెచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం శోచనీయమన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ప్రత్యేకంగా ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగం భూమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండారపు సౌజన్యగంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, ఎంపీటీసీ కొండ అంజనేయులు పాల్గొన్నారు.

కాలువ పూడ్చి.. రహదారి ఏర్పాటు

● పొంచి ఉన్న ముప్పు.. పట్టించుకోని అధికారులు ● కనుమరుగు కానున్న జలబుగ్గ ● కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కనే తంతు



రాళ్లతో పూడ్చివేసిన కాలువ



కాలువపై ఏర్పాటు చేసిన రహదారి



ఉనికి కోల్పోయిన జలబుగ్గ

మల్యాల, ఫిబ్రవరి 11: గుట్టల ద్వారా వచ్చే నీటి ప్రవాహ కాలువను కొందరు అక్రమంగా పూడ్చివేశారు. బండరాళ్లతో నింపి దానిపై యథేచ్ఛగా రహదారి ఏర్పాటు చేశారు. దీంతో కాలువ నీటి ప్రవాహంతో ప్రమాదం పొంచి ఉంది. అయిప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రకృతి సహజసిద్ధ కాలువలను కాపాడి వాటిని మరింత అభివృద్ధి చేయాల్సి ఉండగా వాటిని పూడ్చివేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. కొండగట్టు ఘాట్‌రోడ్డు మార్గం పక్కన గల కాలువ(ఒర్రె) ద్వారా గుట్టల నుంచి వచ్చే వర్షపు నీరు ప్రవహిస్తుండగా గతంలోనే దాన్ని మళ్లించడంతో కాలువ ఉనికి కోల్పోయింది. కాలువను పూడ్చివేసి దానిపై రహదారి ఏర్పాటుచేసి గుట్టల మట్టిని తరలిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

● కాలువపై దారి ఏర్పాటు..

ఘాట్‌రోడ్డు పక్కన భూములు గల పట్టాదారులు ఇటీవల చదును చేస్తున్నారు. మట్టితో నింపుతున్నారు. అయితే ఆ మట్టిని తరలించడానికి గాను కాలువపై గల రహదారిపై నుంచి టిప్పర్లను నడిపిస్తున్నారు. గుట్టల నుంచి వచ్చే నీటి ప్రహహంకు సహజసిద్ధ కాలువను పూడ్చివేయడంతో అది ప్రమాదకరంగా మారింది. నీరు వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. కాలువలోనూ బండరాళ్లు నిండుకున్నాయి. ఘాట్‌రోడ్డు పక్కనే ఇదంతా జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువ పూడ్చివేతదారులపై చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువను పునరుద్ధరించే చర్యలు తీసుకొని మరింతగా విస్తరించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● కాలువకు అడ్డంగా నిర్మాణాలు

గుట్టల నుంచి వచ్చే కాలువను దారి మళ్లించి రియల్ వ్యాపారులు భారీ నిర్మాణాలు చేపట్టారు. కాలువ ఉనికి కోల్పోయోలా నిర్మాణాలు చేపట్టడంతో నీరంతా అక్కడ ప్రమాదకరంగా మారుతోంది. కాలువ(ఒర్రె)ను పూడ్చివేయంతో ఏర్పడిన గోతిలో ఆర్టీసీ బస్సు పడి 57మంది మృతి చెందగా అనేక మంది క్షతగాత్రులు అయ్యారు. నిర్మాణాలు కూడా నీటిలో ఉండగా వాటి నిర్మాణాలు నిలిచిపోయినప్పటికీ కాలువ మాత్రం అలాగే ఉంది. కాలువ పూడ్చివేసి దానిపై ఏర్పాటు చేసిన రహదారి నుంచి సమీపానే గల గుట్టల నుంచి మట్టి తరలిస్తున్నారు. పట్టా భూముల పేరిట గుట్టల మట్టిని తరలించడం, గుట్టల చెట్లను వాల్టా చట్టంకు విరుద్ధంగా నరికివేయడం, కాలువను పూడ్చివేయడంపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● జలబుగ్గ కనుమరుగు..

కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో గల చారిత్రాత్మక జలబుగ్గ ఈ కాలువలోనే ఉంది. దేవస్థానం అధికారుల నిరాధరణకు గురి అవుతున్న జలబుగ్గ వద్ద వందల ఏళ్ల క్రితం మునులు తపస్సు చేసేవారని చెబుతుంటారు. అలాంటి ప్రదేశాన్ని పరిరక్షించాల్సి ఉండగా అలాంటి చర్యలు లేకపోవడంతో ప్రస్తుతం పూడ్చివేసిన కాలువలో అది కనుమరుగు అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే జలబుగ్గ ఆనవాళ్లు కోల్పోగా కాలువ పూడ్చివేతతో ప్రమాదంలో పడింది.

● ఆలయ భూముల్లో చదును

ఘాట్‌రోడ్డు పక్కన పట్టాదారులు తమ భూములను ఇటీవల చదును చేస్తుండగా.. వాటి పక్కనే గల దేవస్థానం భూముల్లో కూడా చదును పనులు చేపడుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈవోను కోరారు. చదును చేసే వాళ్లకు రహదారికి దూరంగా భూములు ఉండగా దేవస్థానం భూముల్లోకి వస్తున్నారని ఫిర్యాదు చేశారు. చదును చేస్తున్న ప్రాంతంలో గల ఆలయ భూములపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంజన్న భూముల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● సర్వే చేయిస్తాం..

పి వెంకటేష్, ఈవో

ఘాట్‌రోడ్డు పక్కన చదును చేయిస్తున్న దేవస్థానం భూములపై సర్వే చేయిస్తాం. సర్వే అయ్యాక హద్దులు ఏర్పాటు చేయించి భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుం టాం. అలాగే జలబుగ్గ సంరక్షణ చేపడుతాం. అభివృద్ధి చేసి భక్తులు సందర్శించేలా చూస్తాం.

● చర్యలు తీసుకోవాలి

రామాంజనేయులు, కొండగట్టు

కాలువను పూడ్చి రహదారి ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. కాలువను పూడ్చివేయడంతో ప్రమాదకంగా మారింది. కాలువపై రహదారిని తొలగించి యధావిధిగా పునరుద్ధరించాలి. అలాగే కాలువకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలి. గుట్టల మట్టిని అక్రమంగా తరలిస్తున్న అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారు. జలబుగ్గను పర్యటకంగా మార్చాలి.

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11: ప్రస్తుత ప్రపంచంలో ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు వేడుకల హంగామాను వార్వెల్ పేరుతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విజయాల పట్ల ఆతృత ప్రదర్శించాలని, సమాజానికి చేయూతనివ్వాలన్నారు. ప్రస్తుత ప్రపంచంలో ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులు పరీక్షలు అద్భుతంగా రాయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' దరఖాస్తులపై ఇంటింటి సర్వే



వెంకట్రావుపేటలో వివరాలను సేకరిస్తున్న విద్యుత్ అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల నుంచి ప్రజాపాలన ద్వారా స్వీకరించిన గృహజ్యోతి దరఖాస్తులపై ఆదివారం విద్యుత్ అధికారులు సర్వే నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో విద్యుత్ అధికారులు ఇంటింటికి తిరుగుతూ గృహజ్యోతి కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ రాజలింగు, జూనియర్‌లైన్‌మెన్ ప్రభాకర్ , సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: గృహజ్యోతి పథకం కోసం లబ్ధిదారులు అధికారులకు సహకరించాలని విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ రవి కోరారు. ఆదివారం వెంకట్రావుపేట, 12వ వార్డుల్లో ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇంటికి వచ్చిన అధికారులకు దరఖాస్తుదారులు తమకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో తెలపి సహకరించాలని కోరారు. దరఖాస్తులను సర్వే చేస్తున్న వారిలో ట్రాన్స్‌కో టౌన్-2 ఏఈ రవి, సిబ్బంది అనంతం, లక్ష్మణ్, భాను, రంజిత్, నాయకులు కొమిరెడ్డి శ్రీనివాస్, చర్లపల్లి సత్యనారాయణగౌడ్, తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ



మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ

గిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, వారి సమస్యలను విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌ల ఆత్మీయ సమ్మేళనం- సమస్యలపై చర్చ, భవిష్యత్ కార్యాచరణపై సమావేశం ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయలక్ష్మీ హాజరై మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి కల్పించేవారు ఫీల్డ్ అసిస్టెంట్‌లన్నారు. ఈ పథకం కింద చేపట్టే కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించే క్షేత్ర సహాయకుల వ్యవస్థకే మంగళం పాడే విధంగా గత ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ఉపాధి హామీ పథకం ఆరంభం నుంచి అమలులో విజయవంతానికి కృషి చేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం అన్నారు.

చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తమ హక్కుల కోసం పోరాటం చేస్తుంటే ఓర్చుకోని ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరించిందన్నారు. కరోనా విపత్కర పరిస్థితిలో సైతం కరుణ చూపలేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయపోరాటంతో దిగోచ్చిన ప్రభుత్వం 28 నెలల నిరీక్షణ తర్వాత విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు తమ హక్కుల కోసం ఉద్యమిస్తే ప్రశ్నించే గొంతుకై అండగా నిలిచిన నాయకుడు జీవన్‌రెడ్డి అన్నారు. జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేలా తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీటి పథకాల వద్ద శుభ్రత చర్యలు

మల్యాల, ఫిబ్రవరి 11: ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో గల నీటి పథకాల వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టారు. నీటి ట్యాంక్‌ల ను శుభ్రం చేశారు. నిత్యం క్లోరినేషన్ చేయాలని పంచాయితీ సిబ్బందికి సూచించారు. అనంతరం స్వశక్తి మహిళలచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో వెంకటేషం, ఎంపీవో వాసవి గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు

ప్రభుత్వ విప్‌ను కలిసిన గ్రామస్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన కురుమ, యాదవ సంఘం, పలువురు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ఆదివారం మండల కేంద్రంలో కలిశారు. ఈ సందర్భంగా కుల దైవమైన బీరయ్య గుడి వద్దకు అలాగే యాదవ సంఘం కుల దైవమైన చౌడాలమ్మ దేవాలయం వద్దకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘాల అధ్యక్షులు బొమ్మ పెద్ద నర్సయ్య, గడ్డం మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు రఘుపతిగౌడ్, నరసింహారెడ్డి, కిష్టంపేట రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న గోపి

రాయికల్, ఫిబ్రవరి 11: రాయికల్ పట్టణానికి చెందిన జాన గోపి అంబేద్కర్ నేషనల్ అవార్డును అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 7వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.సుబ్రమనియన్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకువెళ్లడం కోసం కృషి చేసినందుకు గోపికి అవార్డును అందజేసినట్లు అవార్డు కమిటీ మెంబర్ తాళ్లపెల్లి సురేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాన గోపిని పలువురు అభినందించారు.

రూ. 4.90 లక్షల ఆర్థిక సహాయం

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో భీష్మానగర్ కాలనీకి చెందిన కొంద్ర సాగర్ ఇటీవల వాగు నీటిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి సుమారు రూ. 4.90 లక్షల ఆర్థిక సహాయాన్ని స్నేహితుడైన బింగి నరేశ్-మౌనిక దంపతులు అందించారు. ఆదివారం పట్టణంలోని సాగర్ కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. బాధిత కుటుంబానికి రూ. 4.50 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఇతర ఖర్చులకు సుమారు రూ. 40 వేల వరకు అందించారు. కార్యక్రమంలో నాయకులు సూరజ్ శివ శంకర్, అరుమల్ల హరి, తొపారపు రవి, ఆరుమళ్ల నారాయణ, తప్ప లక్ష్మీ నారాయణ, సిరికొండ గంగరాజం పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

రాయికల్, ఫిబ్రవరి 11: మండలంలోని అల్లీపూర్‌కు చెందిన నిరుపేద యువతి రేపాక ఆనందం-సత్తెమ్మ దంపతుల కుమార్తె గాయత్రి వివాహానికి ఉషోదయ యూత్ ఆధ్వర్యంలో ఆది వారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యువతికి రూ.12,500లతో పాటు 25 కిలోల బియ్యం, బంగారు ముక్కు పుడక అందించారు. ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి వివాహానికి హాజరై ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా చలి బోనాల వేడుకలు





మల్లాపూర్‌లో బోనాలతో ఆలయానికి బయలుదేరిన మహిళలు, మెట్‌పల్లిలోని గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకోవడానికి క్యూ కట్టిన భక్తులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం చలి బోనాల వేడుకలను గ్రామస్థులు నిర్వహించారు. పట్టణ శివారుతో పాటు గ్రామంలో పోచమ్మ దేవతకు చలి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు రాత్రి వేళలో వండుకున్న నైవేద్యంను పోచమ్మకు సమర్పించి వనభోజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయాలతో పాటు గ్రామ దేవతల ఆలయాల వద్ద సందడి నెలకొంది. పట్టణంలోని కల్లూర్ రోడ్డుతో పాటు పోచమ్మవాడలోని పోచమ్మ ఆలయం వద్ద మహిళలు చలి బోనాలు సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించడానికి భక్తులు పోటెత్తారు. పుష్య మాసం మొదటి ఆదివారం సందర్భంగా ఆలయాల్లోని అమ్మవారిని దర్శించుకోవడానికి వేకువజాము నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఒక రోజు ముందు రాత్రి తెళ్ళవారు చలి బోనాలను తీసుకొని అమ్మవారికి నైవేధ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చలి బోనాల పండుగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెలవారుజాము నుంచి బోనాలను సమర్పించడానికి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బెల్లం అన్నంతో తయారు చేసిన నౌవేద్యం, చలి అన్నంతో మల్లాపూర్‌లోని పోచమ్మ ఆలయానికి పొలాల మధ్య నడుచుకుంటూ మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలోని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసిన చల్లంగా చూడు తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో మహిళలు పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో ఆదివారం మల్లన్న బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న దేవాలయంలో యాదవ పూజారులు ప్రత్యేక పూజలను జరిపారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో శోభాయాత్రను జరుపగా పోతరాజులు చేసిన నృత్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. మహిళలు బోనా లను మల్లన్నకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.